‘ఏం లేదు.... ఫోటోల రేట్లు ఏంతో అప్పుడుచెప్తానని అన్నాను......’ గడ్డిపరకలు అన్నీ నోట్లో పెట్టేసుకున్నాడు.

కిష్టయ్య కాఫీ కప్పుతో వచ్చాడు.

‘అవి తరువాత తినొచ్చు .... ముందు కాఫీ తాగండి’ అంది కిష్టయ్య చేతిలోని కాఫీకప్పుని రాంబాబుకి అందిస్తూ.

‘ఏవి తరువాత తినొచ్చు?’ రాంబాబు అడిగాడు.

‘గడ్డిపరకలు??’ సరోజ నవ్వింది.

రాంబాబు ముసిముసిగా నవ్వుతూ తలొంచుకున్నాడు.

## ఫోటోల కాంట్రాక్ట్

ఎలా ఉందిరా?’ కిష్టయ్యని అడిగాడు రాంబాబు.

కిష్టయ్య రాంబాబు వంక పరిశీలనగా అరనిమిషంపాటు చూశాడు.

‘చెప్పు ఎలావుంది?’

‘బ్రహ్మాండంగా ఉన్నారు గురూగారూ....మీసాలు ఉండడం వల్ల తెలుగుసిన్మా హీరోలా వున్నారు. మీసాలు గొరిగేస్తే అచ్చు హిందీ సినిమా హీరోలా ఉంటారు.’

‘హిందీ సినీమా హీరోలా ఉంటే బావుండుందా? తెలుగు హీరోలా ఉంటే బావుంటుందా?’

‘హిందీ సినిమా హీరోకి గ్లాసురెక్కువ కదండీ గురూగారూ....’

‘కానీ నేను మీసాలు తీసేస్తే సరోజకు నచ్చుతుందో లేదో?’

‘ఆవిడనే అడిగి చూడండి.....’

‘ఏవనుకుంటుందో....’

‘ఇందులో అనుకోడాని కేముంది గురూగారూ.....తన అభిప్రాయం చెవుతుంది.... అంతే....’

‘ఏదో సమయం చూసి అడిగేస్తే..... అసలు ఈ రోజు వస్తుందంటావా?’

‘ఎందుకు రాదండీ..... తపకుండా వస్తుంది.....కొత్తబట్టలు తీసుకోడానికి టైలరు దగ్గరికి ఎవరయినా రాకపోవచ్చేమో గానీ ఫోటోలు తీసుకోడానికి రాకుండా ఎవరూ ఉండరండీ..... కురూపిగా ఉండేవాళ్ళకి కూడా ఫోటోలో ఎలా పడ్డామో చూసుకోవాలన్న ఆతృత ఉంటుందండీ..... అదో గమ్మతయిన పిచ్చి’

‘అంతేనంటావా?.....’ ఆనందంగా అన్నాడు రాంబాబు టై సర్దుకుంటూ.

‘అంతేనండి....’

ఆ రోజు పిక్నిక్‌లో తీసిన ఫోటోలు తీసుకోవడం కోసం సరోజ వస్తానంది. అందుకే రాంబాబు ప్రత్యేకమైన శ్రద్ధ చూపించి తయారయ్యాడు.

ఒకసారి రేగిన జుట్టుని దువ్వుకుని డ్రాయరు సొరుగులోంచి అద్దం తీసి చూస్కున్నాడు.
'ఒరేయే.... ఎన్నడూలేంది ఈవేళ నా మెడనరాలు అసహ్యంగా ఇల పొంగి ఉన్నాయేంట్రా నాదస్వరం ఊదేవాడిలా .....' మెడ తడుముకుంటూ అన్నాడు. రాంబాబు.
'మీరుటైని కాస్త వదులుగా కట్టుకోండి గురూగారూ... అదే సర్దుకుంటుంది....' అన్నాడు కిష్టయ్యటేబుల్మీది ఈగని పట్టాలని ప్రయత్నిస్తూ.
రాంబాబు టై ముడి లూజ్ చేస్తుండగా అతను గుమ్మంలో ప్రత్యక్షమయ్యాడు.
'నమస్కారం సార్....' గారపళ్ళు ఇకిలిస్తూ అన్నాడు అతను.
'నమస్కారం.... రండి కూర్చోండి.....' రాంబాబు ప్రతి నమస్కారం చేశాడు.
అతను రెండు చెవులదాకా విశాలంగా నవ్వి కూర్చున్నాడు. సగం సగం పండిన వెంట్రుకలు మధ్య పాపిడితీసి పైకి దువ్వాడు. అతను నవ్వితే ఎందుకో మొహం అంతాముడుతలు పడిపోతున్నట్టు అనిపిస్తుంది. అతని వయసు నలభై సంవత్సరాలు ఉంటుంది.
'మీరు?....' రాంబాబు ప్రశ్నార్థకంగా చూశాడు.
'నా పేరు శివలింగం.... చిక్కడపల్లి ఫంక్షన్ హాలు ప్రొప్రయిటర్ని....' రెండు చెవులదాకా విశాలంగా నవ్వుతూ చెప్పాడు.
'పాస్పోర్ట్ ఫోటో కైతే మూడు రూపాయలండీ..... కార్డుసైజు కైతే పన్నెండు రూపాయలండీ..... మరేమో ..... ' కిష్టయ్య రేట్లు చెప్పుకుంటూ పోతున్నాడు.
'అబ్బే....నేను మీ దగ్గర ఫోటో తీయించుకోవాలనిరాలేదండి......' ఇంకా విశాలంగా నవ్వాడు ఈసారి.
'మరి?....' రాంబాబు కిష్టయ్యా ఒక్కసారి అన్నారు.
'హైదరాబాద్లో అన్ని మారేజి హాల్స్లోనూ, ఫంక్షన్ హాల్స్లోనూ అన్నిరకాల సదుపాయాలుంటాయ్..... అంటే ఎవరైనా పెళ్ళి చేసుకుంటున్నారను కోండి..... అక్కడ బంధువులు ఉండడానికి గదులుంటాయ్. బాత్రూములూ లెట్రిన్లూ ఉంటాయి. వంట సామాను అద్దెకి తీసుకోడానికి ఉంటాయి. వండి పెట్టడాని కి బ్రాహ్మళ్ళు ఉంటారు. భోజనం చెయ్యడానికి టేబుళ్ళూ కుర్చీలు ఉంటాయి.....కానీ పెళ్ళిళ్ళకూ, ఫంక్షన్స్కీ అవసరమైంది ఒకటి మాత్రం ఏ ఫంక్షన హాల్లోనూ ఉండదు....'
అతను విశాలంగా నవ్వాడు.
'ఏంటది!' రాంబాబు కుతూహలంగా ప్రశ్నించడు.
'ఫోటోలు!.... ఏదైనా ఫంక్ష నైనా పెళ్ళిజరిగినా ఫోటోలు తీయించని వాడుండడు. కానీ వాటి గురించే ఈ మ్యారేజ్హాల్స్ వాళ్ళు అశ్రద్ధచేస్తున్నారు.'
'ఇంతకీ మీరు చెప్పేచేంటి?'
శివలింగం విశాలంగా నవ్వి ముందుకు వంగాడు.

రాంబాబు కుర్చీలో వెనక్కి ఒరిగాడు.
'మా ఆవిడా అంతే ..... నేను ముందుకు వంగితే తను వెనక్కి జరుగుతుంది. అదేంటోగానీ ఎంతోమంది డెంటిస్టుల్ని కలిసినా, ఏ టూత్ పేస్ట్ వాడినా నా నోటి దుర్వాసన మాత్రం తగ్గటంలేదు....' అన్నాడు శివలింగం విచారంగా.
'అబ్బే ..... నేనందుకు కాదు వెనక్కి జరిగింది. ఇందాకట్నుంచీ ముందుకి వంగి కూర్చున్నందువల్ల నడుం నొప్పెట్టి వెనక్కి జారబడ్డా..... చెప్పండి.....'
శివలింగం విశాలంగా నవ్వాడు.
'అంటే పెళ్ళిళ్ళుగట్రా జరిగితే వాళ్ళు ఫోటోగ్రాఫర్ని మాట్లాడుకుని వెంటతెచ్చుకోవాల్సి ఉంటుంది. ఆ అవసరం కూడా వాళ్ళకి లేకుండా చేస్తే.....?'
'అంటే?' రాంబాబు గుండె వేగంగా కొట్టుకుంది.
'ఏముందీ.... వచ్చిన వాళ్ళకి మా ఫంక్షన్ హాల్‌లో ఫోటోలు కూడా మేమే తీయించి ఇస్తాం మీకు శ్రమ లేకుండా .... మా ఫోటో గ్రాఫర్ ఉన్నాడు అంటాం.....'
శివలింగం విశాలంగా నవ్వాడు.
'మీ ఫోటో గ్రాఫర్ ఎవరు?....'
'ఇంకెవరూ.... మీరే ....'
రాంబాబు సంతోషంతో కేక పెట్టబోయాడుగానీ కిష్టయ్య కన్నుగొట్టి సైగ చేయడంతో ఆగిపోయాడు.
'కానీ అందువల్ల మీకు ఒరిగే లాభం ఏమిటి' అన్నాడు కిష్టయ్య శివలింగంతో.
'కుర్రాడివైనా చాకులాంటి ప్రశ్న అడిగావ్....మా పంక్షన్ హాల్లో ఏం జరిగినా నేనూ మిమ్మల్ని పిలుస్తాను. మీకు పని అప్పజెప్పినందుకు నాకు కాస్త కమీషన్ ఇవ్వాల్సి ఉంటుంది......ఇదీ మనమధ్య కాంట్రాక్ట్, కానీ మీరిచ్చే కమీషన్ నాకు పెద్ద లాభం కాదనుకోండి. నాకు లాభించే విషయంవేరే వుంది. ఏ మ్యారేజ్ హాలు వాళ్ళూ ప్రవేశపెట్టని పద్దతి నేను ప్రవేశ పెట్టడంవల్ల నా ఫంక్షన్ హాల్‌కి గొప్ప పబ్లిసిటీ లభిస్తుంది. దాంతో దీనికి మంచిపేరు వచ్చి అందరూ ఇక్కడే ఫంక్షన్స్ జరుపుకోవాలని ఎగబడ్తారు. దాంతో ఫంక్షన్ హాలు ఖాళీగా ఉండకుండా ఎప్పుడు బిజీగా ఉండడమే కాకుండా నేను హాలు అద్దె పెంచడానికి కూడా అవకాశం ఉంటుంది.....'
ఈసారి శివలింగం మరీ విశాలంగా నవ్వాడు. అతని నవ్వుకు పూర్తి అవకాశం ఇవ్వడం కోసం అతని చెవులు కాస్త వెనక్కి జరిగాయి.
'కానీ మిగతా ఫంక్షన్ హాల్సు వాళ్ళందరూ ఇదే పద్దతిని తరువాత అనుసరించవచ్చుగా....' రాంబాబు తనకి వచ్చిన సందేహాన్ని అడిగాడు.
'ఎప్పుడూ ఒక కొత్త విషయాన్ని కనిపెట్టిన వాడికి వచ్చే పేరు ఆ తరువాత దాన్ని అనుసరించే వాడికి రాదు..... చెప్పండి .... నా ప్రపోజల్ మీకు నచ్చిందా .... మా ఫంక్షన్

హాల్లో జరిగే కార్యక్రమాల్ని ఫోటోలు తీస్తారా?.... ఈ కాంట్రాక్టు మీ కిష్టమేనా?'

రాంబాబు తనకి ఇష్టమని చెప్పేలోగా కిష్టయ్య రాంబాబుని ఏమీ అననీకుండా తను అందుకున్నాడు.

'అబ్బే.....కాస్త ఆలోచించుకోవాలండీ.....మేము చాలా ఆలోచించుకోవాలండీ....మేము చాలా బిజీ....' రాంబాబు కిష్టయ్య వంక గుర్రుగా చూశాడు. కిష్టయ్య రాంబాబు పక్కకి వచ్చి చెవులో చెప్పాడు.

'మీరు వెంటనే ఒప్పుకంటేమనకేం పనీపాటా లేదని అనుకుంటాడండీ గురూగారూ ..... కాస్త బెట్టుచేస్తే మనం ఇవ్వాల్సిన కమీషన్ తగ్గిస్తాడు.....'

'అవునవును....నువ్వు చెప్పింది కరెక్టే.....' కిష్టయ్యచెవిలో అని కన్ను కొట్టాడు రాంబాబు.

'అవునండి మాకు చాలా పనులుంటాయ్...చాలా బిజీ??..... అవును ఏడియానా?.....'

ఎదురుగా ఖాళీ కుర్చీ చూపించి కంగారు పడ్డాడు రాంబాబు. కిష్టయ్య గుమ్మంలోకి పరిగెత్తికెళ్ళి చూశాడు.

గురూగారూ....ఆయన అప్పుడే అంతదూరం వెళ్ళిపొయారు.....'

'పద...పద....లాక్కొద్దాం'

ఇద్దరూ బయటికి పరిగెత్తి శివలింగాన్ని స్టూడియోలోకి లాక్కొచ్చారు.

'మరి మీరేకదా ఖాళీలేదని బిజీ అని అన్నారు..... అందుకే వేరేఫోటో స్టూడియో వాడిని కాంట్రాక్టుకి తీసుకుందామని వెళ్తున్నా....' అన్నాడు చురచురచూస్తూ శివలింగం.

'అబ్బే....బిజీయే అనుకోండి....కానీ ఎప్పుడూ స్టూడియోకి వచ్చేవాళ్ళ ముఖాలు తీసీ తీసీ విసుగొచ్చింది.....ఇలా ఔట్‌డోర్ వర్కు కాస్తరిలీఫ్ ఇస్తుంది....' అన్నాడు రాంబాబు.

'అయితే మనం కంట్రాక్టులోకి ఎంటర్ అవుతున్నట్టేగా?.....'

'అంతేగా మరి' అన్నాడు రాంబాబు చిరునవ్వుతో.

సరిగ్గా అదే సమయంలో స్టూడియోలోకి సరోజ ఎంటర్ అయ్యింది మెరుపుతీగెలా.

రాంబాబు టై సర్దుకుని గబుక్కున లేచి నిలబడ్డాడు.

'రండి రండి సరోజగారూ....కూర్చోండి.....'అన్నాడు.

సరోజ శివలంగం పక్కకుర్చీలో రాంబాబుకి ఎదురుగా కూర్చుంది.

'మా ఫోటోలు రెడీగా ఉన్నాయా?'

'ఉన్నాయండి....'

'బిల్ ఎంత?'

'అబ్బే.... ఎందుకులెండి....'

'అలాక్కాదు.... చెప్పండి.....'

'అబ్బే....ఎందుకులెండి....'

'ఫరవాలేదు చెప్పండి....'

'మీరు నా ప్రాణాల్ని రక్షించారు....మీ దగ్గర డబ్బుఎలా తీసుకంటాను....'
రాంబాబు తల వంచుకుని బొటనవేల్తో నేలని రాస్తు అన్నాడు.
'ఇదేమీ నా డబ్బు కాదుగా..... మేం అందరం తలోకొంతా కంట్రిబ్యూట్ చేసుకున్నడబ్బు.... చెప్పండి మీ బిల్ ఎంత?'
'రెండు వందల పదిహేను అయ్యింది ....మీరు నాకు వందరూపాయలు అడ్వాన్స్‌గా ఇచ్చారు కాబట్టి ఇంకా నూట పదిహేను ఇస్తేసరిపోతుంది....'
సరోజ పర్సు తెరిచింది.
'డబ్బులు తరువాత ఇవ్వొచ్చుగాని ముందు గాని ఫోటోలు చూడండి.....ఒరేయ్ కిష్టయ్యా .... రెండు కూల్‌డ్రింక్స్ తీసురారా.....' కిష్టయ్య బయటికి పరుగెత్తాడు.
సరోజకి ఫోటోలున్న కవరు అందించాడు. కవరు ఓపెన్ చేసి ఫోటోలు బయటికి తీసింది.
రాంబాబు మనసులో ఎన్నెన్నో ఆలోచనలు .... మెదడులో గజిబిజిగా ఎన్నెన్నో ఊహలు!.... సరోజకి చెప్పెయ్యాలి ఆమెని ప్రేమిస్తున్నట్టు. అన్నట్టు మీసాలుఉంటే బావుంటుందో లేకపోతే బావుంటుందో కూడా అడిగెయ్యాలి! ఈ శివలింగం లేకపోతే ఇప్పుడే అడిగేసి ఉండొచ్చు.
నీళ్ళలో దూకినప్పుడు సరోజ జుట్టుపట్టి లాగితే లాగుండొచ్చు కానీ ఆ స్పర్శలోని ఆనందం ..... ఓహ్......
ఈవేళ సరోజకి ఎలాగైనా మనసులోని మాట చెప్పాయ్యాలి.
ఆలోచనల్లోంచి ఈలోకంలోకి వచ్చిన రాంబాబు మెల్లగా తలతిప్పి సరోజవంక చూశాడు.
ఆదృశ్యం చూసిన రాంబాబు మనసు కీడుని శంకించింది. అతని హృదయంభారంగా కొట్టుకుంది. తను మనసులో నిర్మించుకున్న ఊహా సౌధాలన్నీ పేకమేడాలై తన కళ్ళముందే కూలిపోతున్నట్టు భయంకరమైన భావన.
రాంబాబు కంపించే శరీరంతో చూశాడు.
సరోజ చేతిలోంచి శివలింగం, అతని చేతిలోంచి సరోజ ఫోటోతీసుకుని మార్చి మార్చి తనవంక చుస్తున్నారు ఇద్దరి ముఖంలో రాంబాబు ఊహకందని ఎక్స్‌ప్రెషన్స్!!
ఇద్దరూ మెల్లగా తలెత్తి రాంబాబు వంక చూశారు.
రాంబాబు కంపించే పెదాల్తోమెల్లగా తనలో తను అనుకుంటున్నట్టుగా అన్నాడు.
'ఓహ్....నో.....నో...'

## *ఫ్రేమ్ - 6*
## *సరోజకోపం వచ్చింది*

సరోజ మొహం మీద ఇందాకటి చిరునవ్వులేదు. ఆమె కనుబొమ్మలు ముడిపడి ముడివడి ఉన్నాయి.

చేతిలోని ఫోటోలు కవర్లో పెట్టి రాంబాబు ముందు పెట్టి లేచినిలబడింది సరోజ.

'మీరు ఫోటోగ్రఫీ అంటే ఏంటో తెలుసుకున్నాక స్టుడియో పెట్టాల్సిందిమిస్టర్ రాంబాబూ.....'

రాంబాబు చాలా కంగారు పడిపోయాడు.

'ప్లీజ్....మీరు కూర్చోండి సరోజగారూ..... అలా అనకండి.......ప్లీజ్ అలా చూడకండి....నేను ఎన్నో ఆశలు పెట్టుకున్నాను.....ప్లీజ్ ...నేను ఫోటోలు బాగానే తీద్దామని అనుకున్నానుగానీ.... అదేంటో చెయ్యి వణికి.....'

సరోజ పర్సు తెరిచి డబ్బుతీసి రాంబాబు ముందు టేబులు మీద ఉంచింది.

'మీరేమీ నిరాశ పడాల్సిన పనిలేదు. మీకు రావాల్సిన నూటాపదిహేను రూపాయలు!.... తీసుకోండి....మీరు తీసిన ఫోటోలు మాత్రంనాకు అవసరంలేదు.'

'అబ్బే ....మీరు పొరబాటు పడ్తున్నారు సరోజగారూ...నేను డబ్బు గురించి కాదు అలా అంది ..... ఇంకా ఏదో చెప్దామనీ ....'

'గుడ్‌బై మిష్టర్ రాంబాబు....'

సరోజ గుమ్మం వైపు అడుగులు వేసింది.

అదే సమయలో కూల్‌డ్రింక్స్ బాటిల్స్‌తో కిష్టాయ్య లోపలికి వచ్చాడు.

'అదేంటండీ అప్పుడే వెళ్ళిపోతున్నారు....కూల్‌డ్రింక్స్ తాగి వెళ్ళండి....'

కిష్టయ్య మాట పూర్తిచేసేలోగా సరోజ గుమ్మందాటి బయటకి వెళ్ళిపోయింది.

'ఏంటి గురూగారూ .... ఆవిడ అలా వెళ్ళిపోయింది..... ఇంతకి మీరనుకున్నవన్నీ అడిగిరాలేదా?.....'

రాంబాబు బయటికి పరుగెత్తి సరోజను కలిశాడు.

సరోజ రాంబాబు వంక చూడనైనా చూడలేదు .

'అది కాదండీ .....ప్లీజ్ .....ఏంటో .... చాలా అనుకుని' ఆమె పక్క పక్కన వంగి నడుస్తూచేతులు నలుపుకుంటూ గొణిగాడు రాంబాబు.

'గుడ్‌బై మిస్టర్ రాంబాబూ....'

'అది కాదండీ .... అసలది ఎలా జరిగిందంటే మిమ్మల్ని తీస్తున్నా కదా.... గుండె వణికి ....కాదు చెయ్యివణికి....'